## ఖాళీ షాపులు విక్రయానికి బహిరంగ వేలం

-కీసర ఆర్డీఓ నల్ల వెంకట్‌రెడ్డి

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 4, ప్రభాతవార్త:**
ఈ నెల 7వతేదీన కీసర రెవెన్యూడివిజన్ పరిధిలోని వివిధప్రాంతాల్లో ఉన్న డబుల్‌బెడ్‌రూమ్స్ కాలనీల వద్ద ఖాళీగా ఉన్న షట్టర్స్‌ను విక్రయించటానికి బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు కీసర ఆర్డీఓ నల్ల వెంకట్‌రెడ్డి తెలిపారు. ఈవేలం మేడ్చల్ జిల్లా కీసరమండలం బోగారంలోని కెబిఆర్ కన్వెన్షన్‌హాల్‌లో వివిధప్రాంతాల్లో జిహెచ్‌ఎంసి నిర్మించిన 2బిహెచ్‌కె కాలనీల్లో ఖాళీగా ఉన్న షాప్స్‌కు(వర్షం కారణంగా) కీసర ఆర్టీఓకార్యాలయంకు బదులుగా కెబిఆర్ కన్వెన్షన్‌హాల్‌లో 7న నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ షాప్స్‌ప్రాంతాలు చైతన్యనగర్, చర్లపల్లి, శ్రీరాంనగర్, కొర్రెముల, రాంపల్లి, తూంకుంట, మురహరిపల్లి, అహ్మద్‌గూడ, మల్లాపూర్ ప్రాంతాల్లోని ఖాళీషట్టర్స్‌ను వేలం వేయటం జరుగుతుందని అన్నారు. వివరాలకు పిడి హౌజింగ్ ఆఫీస్ ఫోన్ నెంబరు డిఈఈ8712032821, పిడిహెచ్8712032718, కీసర ఆర్డీఓ7995073744, ఎఒ7995073745లకు సంప్రతించాలని ఆర్డీఓ సూచించారు.



రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

# వార్త

## రేపే గురుకులాల్లో స్పాట్ అడ్మిషన్లు

**వికారాబాద్, జులై 4, ప్రభాతవార్త:**
తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సర ప్రవేశాలకు సోమవారం స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించనున్నట్లు సోషల్ వెల్ఫేర్ జిల్లా కోఆర్డినేటర్ కె.సాయిలత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. గురుకులాల్లో 2026-27 ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో జిల్లావ్యాప్తంగా గురుకులాల్లో మిగిలిన సీట్ల భర్తీ కోసం పరిగి పట్టణ పరిధిలోని బాలుర సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఈప్రక్రియ చేపడుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. బాలికలకోసం యాలాల మండలం కోకట్ గురుకుల పాఠశాలలో స్మాట్ అడ్మిషన్ల ప్రక్రియ చేపడుతున్నట్లు తెలిపారు. మార్చి నెలలో నిర్వహించిన ఎస్ఎస్‌సి, సిబిఎస్ఇ, ఐసిఎస్ఈ పరీక్షలలో ఒకే ప్రయత్నంలో ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. సంబంధిత ధృవపత్రాలతో ఉదయం 9గంటల వరకు ఆయాకేంద్రాలకు విద్యార్థులు హాజరుకవాలని ఆమె సూచించారు.

## దొంగల ముఠా అరెస్ట్, రిమాండ్

-22తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం..జవహర్‌నగర్ ఎసిపి చక్రపాణి వెల్లడి



విలేకరులతో మాట్లాడుతున్న ఎసిపి చక్రపాణి, పాల్గొన్న సిఐ, డిఐ తదితరుల దృశ్యం

**కీసర, జులై 4, ప్రభాతవార్త:**
కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు ఇళ్లల్లో చోరీలకు పాల్పడిన దొంగల ముఠాను పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. శనివారం కీసర పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జవహర్‌నగర్ ఎసిపి చక్రపాణి మాట్లాడుతూ తాళాలు వేసి ఉన్న ఇళ్లలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న దొంగల ముఠాను పట్టుకుని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు, వారినుంచి 22తులాల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కీసర పోలీసులు మల్కాజ్‌గిరి సిసిఎస్ పోలీసుల సహకారంతో ఈ చోరీ కేసులను ఛేదించారు. కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్లలో దొంగలు చోరీచేశారని కేసు నమోదు చేయటం జరిగిందని అన్నారు. అయితే సిద్దిపేట్ జిల్లా గజ్వేల్‌కు చెందిన దబ్బేల బాలలింగం, మరో ఆరుగురు అశోక్, చంద్రశేఖర్, నవీన్, బాబు, నరేశ్, రవితో కలిసి రాత్రి వేళల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని ప్రధానద్వారాల తాళాలు విరగ్గొట్టి ఇంట్లోకి ప్రవేశించి బంగారు, వెండి ఆభరణాలు చోరీచేసేవారని అన్నారు. శనివారం కీసరలో అనుమానాస్పదంగా సంచరిస్తుండగా వీరిని అదుపులోకితీసుకుని విచారించటం జరిగిందన్నారు. పోలీసుల విచారణలో ఆ దొంగలు స్వచ్ఛందంగా నేరాలను ఒప్పుకున్నట్లు తెలిపారు. నిందితులు ఏడుగురు కలిసి సులభంగా డబ్బు సంపాదించాలన్న ఉద్దేశ్యంతో ముఠాగా ఏర్పడి చోరీలకు పాల్పడినట్లు తెలిపారు. నిందితులు చోరీ సొత్తును విక్రయించాక వచ్చిన డబ్బులతో గోవాకు వెళ్లి జల్సా చేసినట్లు, వచ్చాక మళ్లీ చోరీలుచేసే ప్రయత్నంలో ఉండగా వారు పోలీసులకు పట్టుబడినట్లు తెలిపారు. ప్రధాననిందితుడు బాలలింగంపై గజ్వేల్ పోలీస్‌స్టేషన్‌లో పరిధిలో 45 క్రిమినల్‌కేసులు నమోదు కాగా, నిరోధక నిర్బంధ చర్యలు (పిడియాక్ట్) అమలుచేశారని జవహర్‌నగర్ ఎసిపి చక్రపాణి వివరించారు. ఈసమావేశంలో ఎసిపితో పాటు సిఐ అంజనేయులు, డిఐ రమేశ్, సిసిఎస్ ఇన్స్‌పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి బలైన లేగదూడ

-భూమికి అతిసమీపంలో ట్రాన్స్‌ఫార్మర్.. షాక్‌తో అక్కడికక్కడే మృతి



విద్యుత్ షాక్‌తో మృతిచెందిన లేగదూడ

**కొత్తూరు, జులై 4, ప్రభాతవార్త:**
విద్యుత్‌శాఖ అధికారుల నిర్లక్ష్యానికి మరో మూగజీవం బలైంది. కొత్తూరు మున్సిపల్ పరిధిలో బజాజ్ షోరూం పక్కన ఓ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలో గడ్డిమేస్తున్న లేగదూడ విద్యుత్ షాక్‌కుగురై అక్కడికక్కడే మృతిచెందింది. ఈ ఘటన స్థానికులను కలచివేసింది. స్థానికుల కథనం ప్రకారం, రహదారి పక్కనే ఏర్పాటుచేసిన ట్రాన్స్‌ఫార్మర్ భద్రతాప్రమాణాలకు విరుద్ధంగా భూమికి అతితక్కువ ఎత్తులో ఉంది. చిన్నపిల్లలు సైతం సులభంగా తాకేంత ప్రమాదకరంగా విద్యుత్ పరికరాలు ఉండడంతో అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. శనివారం గడ్డిమేస్తున్న లేగదూడ ట్రాన్స్‌ఫార్మర్ సమీపానికి వెళ్లడంతో ఒక్కసారిగా విద్యుత్ షాక్‌కు గురై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. ఈఘటనతో స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఇలాంటి ట్రాన్స్‌ఫార్మర్లకు వెంటనే రక్షణ కంచెలు ఏర్పాటుచేయాలని, ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్లు, పరికరాలను భద్రతాప్రమాణాలకు అనుగుణంగా ఎత్తు పెంచాలని వారు డిమాండ్‌చేశారు. అధికారులు నిర్లక్ష్యం వీడి వెంటనే చర్యలు తీసుకోకపోతే మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తంచేశారు.

## బస్టాండ్‌లో గుర్తుతెలియని వృద్ధురాలి మృతి

**కొత్తూరు, జులై 4, ప్రభాతవార్త:**
కొత్తూరు మండలంలోని చేగూర్ ఎక్స్‌రోడ్ బస్టాండ్ వద్ద శనివారం గుర్తుతెలియని వృద్ధురాలు మృతిచెందిన ఘటన కలకలంరేపింది. స్థానికుల సమాచారంతో ఘటనాస్థలికి చేరుకున్న కొత్తూరు పోలీసులు మృతదేహాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసుల వివరాల ప్రకారం.. కొత్తూరు పోలీస్ స్టేషన్‌కు చెందిన పోలీస్ కానిస్టేబుల్ శ్రీనివాస్, ఏఆర్ కానిస్టేబుల్ పవన్‌తో కలిసి మండలపరిధిలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో ఉదయం సుమారు 11:40 గంటలకు చేగూర్ ఎక్స్‌రోడ్ బస్టాండ్‌లో ఓ మహిళ అపస్మారకస్థితిలో పడి ఉందని సమాచారం అందింది. వెంటనే అక్కడికి చేరుకున్న పోలీసులు పరిశీలించగా, సుమారు 70-75 సంవత్సరాల వయస్సుగల గుర్తుతెలియని వృద్ధురాలు మృతిచెందినట్లు గుర్తించారు. గత రెండు నెలలుగా తిమ్మాపూర్, కొత్తూరు పరిసర ప్రాంతాల్లో భిక్షాటనచేస్తూ జీవనం సాగిస్తున్న ఆమె, చేగూర్ ఎక్స్‌రోడ్ బస్టాండ్‌నే ఆశ్రయంగా చేసుకున్నట్లు ప్రాథమిక విచారణలో వెల్లడైంది. ఇటీవల సరైన ఆహారం, తాగునీరు అందకపోవడం లేదా ఇతర అనారోగ్య కారణాలతో మృతిచెంది ఉండవచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించి, కేసు నమోదు చేసి అన్నికోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు కొత్తూరు పోలీసులు తెలిపారు. అలాగే మృతురాలి వివరాలు తెలిసినవారు సమీపంలోని కొత్తూరు పోలీస్ స్టేషన్‌ను సంప్రతించాలని పోలీసులు కోరారు.

## రోడ్డు ప్రమాదంలో ఇంజినీరింగ్ విద్యార్థి మృతి

**శంషాబాద్ జులై 4, ప్రభాతవార్త:**
రెడీమిక్స్ లారీని వెనకనుండి కారు ఢీకొట్టి విద్యార్థి మృతిచెందిన ఘటన శంషాబాద్ రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సిఐ నరేందర్‌రెడ్డి వివరాల ప్రకారం.. పటాన్‌చెరువులోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటూ ఇంజినీరింగ్ చదువుతున్న బైరెడ్డి సావంత్‌రెడ్డి (21) తన స్నేహితుడు సాయిరెడ్డికి చెందిన ఇన్నోవా (ఎపి39ఆర్‌జడ్3024) కారును చెప్పకుండా తీసుకుని బయటకు వెళ్లాడు. తెల్లవారుజామున సుమారు 3 గంటల సమయంలో ఓఆర్ఆర్‌పై పెద్దగోల్కొండ నుంచి గచ్చిబౌలివైపు వెళ్తుండగా, కారు అదుపుతప్పి ముందుగా వెళ్తున్న రెడీమిక్స్ లారీ(టిఎస్29టి9780)ను వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ముందుభాగం పూర్తిగా ధ్వంసమవగా, కారు నడుపుతున్న సావంత్‌రెడ్డికి తీవ్రంగా గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న శంషాబాద్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు ప్రమాదానికిగల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.



రోడ్డు ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

# తొలి సోలార్ మోడల్ మండలంగా కొడంగల్

**-నెలరోజుల్లో రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థల ఏర్పాటు**
**-టిజి రెడ్కో వైస్-చైర్మన్, ఎండి.ముషారఫ్ అలీ ఫరూఖీ**



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దీపక్ తివారి

**కొడంగల్, జులై 4, ప్రభాతవార్త:**
దేశంలోనే తొలి సోలార్ మోడల్ మండలంగా కొడంగల్‌ను తీర్చిదిద్దే ప్రతిష్ఠాత్మక కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజాప్రతినిధులు, అధికారులు, వెండర్లు, ప్రజలు సమష్టిగా కృషిచేయాలని టిజి రెడ్కో వైస్‌చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ ఎండి.ముషారఫ్ అలీ ఫరూఖీ ఐఎఎస్ పిలుపునిచ్చారు. శనివారం కొడంగల్ కడా కార్యాలయంలో జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అధ్యక్షతన నిర్వహించిన సమీక్షాసమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని కార్యక్రమ పురోగతిని సమీక్షించారు. ఈసందర్భంగా ముషారఫ్ అలీ ఫరూఖీ మాట్లాడుతూ ప్రస్తుతం దేశంలో మోడల్ సోలార్ విలేజ్‌లు మాత్రమే అమలులో ఉన్నాయని, ఒక సంపూర్ణమండలాన్ని సోలార్ మోడల్ మండలంగా అభివృద్ధిచేసే కార్యక్రమం దేశంలోనే తొలిసారిగా కొడంగల్‌లో అమలువుతుండటం గర్వకారణమని అన్నారు. ఈ కార్యక్రమం విజయవంతమైతే కొడంగల్ దేశవ్యాప్తంగా ఆదర్శమండలంగా నిలుస్తుందని పేర్కొన్నారు. కొడంగల్ మండలంలో గృహజ్యోతి పథకం కింద ఉన్న 5,186 విద్యుత్ సర్వీసులకు రూఫ్‌టాప్ సోలార్‌వ్యవస్థలు ఏర్పాటు చేసేందుకు అనుమతులు మంజూరుచేసినట్లు తెలిపారు. 2,418 సర్వీసులు సాంకేతికంగా అనుకూలంగా గుర్తించగా, ఇప్పటికే సుమారు 2,000 సోలార్‌వ్యవస్థల ఏర్పాటు పూర్తయిందని, మిగిలిన పనులను కూడా రాబోయే నెలరోజుల్లో పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈపనులను మి/స్ క్లారో ఎనర్జీ లిమిటెడ్, మి/స్ హిందూస్థాన్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థలు చేపడుతున్నాయని తెలిపారు. సోలార్ మోడల్ మండలం లక్ష్యాన్ని నిర్ణీత గడువులోగా సాధించాలంటే సర్పంచ్‌లు, కౌన్సిలర్‌లు, ప్రజాప్రతినిధుల సహకారం అత్యంతకీలకమని ఆయన పేర్కొన్నారు. గ్రామస్థాయిలో ప్రజలకు అవగాహన కల్పించడం, అర్హులైన లబ్ధిదారులను ప్రోత్సహించడం, స్థానికసమస్యలను వెంటనే పరిష్కరించడంద్వారా కార్యక్రమాన్ని వేగవంతంగా పూర్తిచేయవచ్చని అన్నారు. సమీక్షాసమావేశంలో పలువురు సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు తమగ్రామాల్లో జరుగుతున్న పనులవివరాలు, లబ్ధిదారుల జాబితా తమకు అందుబాటులో లేదని ఆయనదృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన టిజి రెడ్కో వైస్‌చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ వెంటనే టిజి రెడ్కో అధికారులు, సంబంధితవెండర్లకు ఆదేశాలు జారీచేస్తూ ప్రతి గ్రామానికి సంబంధించిన లబ్దిదారుల జాబితాను కూడా అధికారుల ద్వారా ఆయాగ్రామాల సర్పంచ్‌లకు అందజేయాలని, పనుల పురోగతిని ఎప్పటికప్పుడు ప్రజాప్రతినిధులతో పంచుకోవాలని సూచించారు. అదేవిధంగా వెండర్లు నాణ్యతవిషయంలో ఎలాంటిరాజీ పడకుండా సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని ఆదేశించారు. ముఖ్యంగా మౌంటింగ్ స్ట్రక్చర్లకు సరైన గ్రౌండింగ్, సమర్థవంతమైన ఎర్తింగ్, లైట్నింగ్ ప్రొటెక్షన్, నీడలేని ప్రదేశాల్లో సోలార్ ప్యానెల్‌ల ఏర్పాటు వంటి అంశాలపై ప్రత్యేకశ్రద్ధ వహించాలని సూచించారు. టిజిఎస్పిడిసిఎల్ అధికారులు నెట్‌మీటర్ల ఏర్పాటు, గ్రిడ్ సింక్రోనైజేషన్ ప్రక్రియలను వేగవంతం చేసి లబ్దిదారులు త్వరితగతిన సోలార్ విద్యుత్ ప్రయోజనాలు పొందేలా చర్యలుతీసుకోవాలని ఆదేశించారు. ఎండి.ముషారఫ్ అలీ ఫరూఖీ, జిల్లా కలెక్టర్, ఇతర అధికారులు ఇప్పటికే ఏర్పాటుచేసిన రూఫ్‌టాప్ సోలార్ వ్యవస్థలను క్షేత్రస్థాయిలో పరిశీలించి పనుల నాణ్యతపై సంతృప్తి వ్యక్తంచేశారు. మిగిలినపనులను కూడా నిర్ణీతగడువులోపూర్తిచేసి, కొడంగల్‌ను సోలార్ మోడల్ మండలంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగాసహకరించాలని పిలుపునిచ్చారు. సమావేశంలో కలెక్టర్ దీపక్ తివారి, కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్, టిజిఎస్పిడిసిఎల్ డైరెక్టర్ నర్సిములు, టిజిరెడ్కో జనరల్‌మేనేజర్ జిఎస్‌వి.ప్రసాద్, సర్పంచ్‌లు, కౌన్సిలర్‌లు, ప్రజాప్రతినిధులు, రెవెన్యూ, పంచాయతీరాజ్, డిస్కం, టిజి రెడ్కో అధికారులు, వెండర్లు పాల్గొన్నారు.

# పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలి

**-హోటల్స్, బేకరీలలో ఆకస్మిక తనిఖీలు చేసిన మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషాకృష్ణారెడ్డి**
**-పాల్గొన్న కమిషనర్ ఎన్.వెంకట్‌రెడ్డి**
**-డ్రైనేజీ పూడిక తీతను పరిశీలించిన చైర్‌పర్సన్, కమిషనర్**



హోటల్‌ను సందర్శించిన మున్సిపల్ చైర్‌పర్సన్, కమిషనర్, సంబంధిత అధికారుల దృశ్యం

**శామీర్‌పేట, జులై 4, ప్రభాతవార్త:**
అలియాబాద్ మున్సిపాల్టీలోని వివిధ వార్డులలో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని సంబంధిత అధికారులను మున్సిపల్ చైర్‌పర్సన్ కె.శిరీషాకృష్ణారెడ్డి ఆదేశించారు. శనివారం శామీర్‌పేట మండలం అలియాబాద్ మున్సిపల్ పరిధిలోని సెంటర్‌లోని డైమండ్స్ కేఫ్ బేకరీ, హోటల్‌ను ఆమెతోపాటు కమిషనర్ ఆకస్మికంగా సందర్శించి తనిఖీలుచేపట్టి పరిశుభ్రతాలోపం ఉందని, పరిశుభ్రత పాటించాలని నిర్వాహకులకు సూచించారు. పారిశుధ్య నిబంధనలను పాటించటం లేదని, ఆహారపదార్థాల నిల్వ, తయారీ, పరిశుభ్రత ప్రమాణాల్లో లోపాలు గుర్తించటంతో సంబంధిత యాజమాన్యానికి రూ.5వేల రూపాయలు జరిమానా విధించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఆహార వ్యాపార సంస్థలు తప్పనిసరిగా పారిశుధ్య నిబంధనలనుపాటించాలని, ఉల్లంఘించినవారిపై కఠినచర్యలు తీసుకోవటం జరుగుతుందని చైర్మన్‌తో పాటు కమిషనర్ ఎన్.వెంకట్‌రెడ్డి స్పష్టంచేశారు. అదేవిధంగా అలియాబాద్‌లోని ప్రధాన మురికికాలువగా ఉన్నదానిలో మురికి, చెత్తాచెదారంతో నిండి ఉండటంతో దాన్ని చైర్‌పర్సన్ కె.శిరీషాకృష్ణారెడ్డి, కమిషనర్ వెంకట్‌రెడ్డిలు సందర్శించి జెసిబితో పూడికతీసే పనులను పరిశీలించారు. పూడికతీయటాన్ని వేగవంతంగా చేయాలని, పూర్తిస్థాయిలో మురికినితొలగించాలని వారు సూచించారు. ప్రజలకు మురికికాలువతో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, సిబ్బంది చూడాలని సూచించారు. అలియాబాద్ రాజీవ్ రహదారి పక్కన వేసవికాలంలో స్థానిక ప్రజలకు చల్లని త్రాగునీరు ఉచితంగా అందజేసిన స్వచ్ఛంద సంస్థ సేవలను చైర్‌పర్సన్ కె.శిరీషాకృష్ణారెడ్డి అభినందించి సేవలు ఆదర్శమని ప్రశంసించారు. అలియాబాద్ గ్రంథాలయానికి పుస్తకాలను విరాళంగా అందజేసిన కార్యక్రమంలో చైర్‌పర్సన్ కె.శిరీషాకృష్ణారెడ్డి పాల్గొన్నారు. గ్రంథాలయ అభివృద్ధికి తోడ్పాటును అందజేసిన కేశవరం గ్రామానికి చెందిన బలరాంచారి తదితర దాతలు స్వచ్ఛందంగా విలువైన పుస్తకాలను విరాళంగా అందజేసినందుకు ఆమె ధన్యవాదాలు తెలియజేశారు. గ్రంథాలయాలను పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని, విద్యాభివృద్ధి కోసం సమాజంలోని ప్రతి ఒక్కరు తమ వంతు సహకారం అందించాలని సూచించారు. ప్రజారోగ్యం, పారిశుధ్యం, మౌలిక సదుపాయాల అభివృద్ధి, విద్యాభివృద్ధి, సామాజిక సేవలు వంటి వాటికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు చైర్‌పర్సన్ కె.శిరీషాకృష్ణారెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాసులు, మేనేజర్ శ్రీనివాస్‌రెడ్డి, గ్రంథాలయపాలకులు, మున్సిపల్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# మేడ్చల్ కాంగ్రెస్‌లో 'గ్రూపుల' గుబులు

**డివిజన్ అధ్యక్షుల నియామకాలతో రచ్చ.. అసంతృప్తి సెగలు.. వర్గపోరుకు ఆజ్యం**

**మేడ్చల్, జులై 4, ప్రభాతవార్త:**
మేడ్చల్ జిల్లాలో కాంగ్రెస్‌పార్టీ మరోసారి గ్రూపు రాజకీయాలకు వేదికగా మారింది. మున్సిపల్ కార్పొరేషన్ల పరిధిలో డివిజన్ అధ్యక్షుల నియామకాలు పార్టీలో తీవ్ర అసంతృప్తికి దారితీశాయి. మేడ్చల్ నియోజకవర్గంలోని పలు డివిజన్లలో ఏకపక్ష నిర్ణయాలు తీసుకున్నారని, సీనియర్లను పక్కనబెట్టారని, బంధుప్రీతికి పెద్దపీటవేశారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా గుండ్లపోచంపల్లి, నాగారం డివిజన్లలో అసంతృప్తి బహిరంగంగా బయటపడగా, శామీర్‌పేట, జవహర్‌నగర్, దమ్మాయిగూడ, పీర్జాదిగూడ, మేడిపల్లి తదితర ప్రాంతాల్లో అంతర్గతంగా తీవ్రచర్చలు కొనసాగుతున్నాయి. మాజీ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌చార్జి జంగయ్యయాదవ్, సీనియర్ నాయకుడు నక్క ప్రభాకర్‌గౌడ్, కీసరప్రాంతంలో ప్రభావం కలిగిన అంజిరెడ్డి, మరో నాయకుడు నవీన్‌రెడ్డి వంటి నేతలు తమ అనుచరవర్గాలతో పార్టీపై ప్రభావం చూపుతున్నారని కార్యకర్తలు పేర్కొంటున్నారు.

హరివర్ధన్‌రెడ్డి కాంగ్రెస్‌పార్టీలో అత్యంత సీనియర్ నాయకుడిగా గుర్తింపుపొందారు. గతంలో మేడ్చల్‌నుంచి కాంగ్రెస్ తరపున పోటీచేసిన ఆయన ఇప్పటికీ జిల్లాలో ప్రభావశీల నాయకుడిగా కొనసాగుతున్నారు. మరోవైపు, ప్రస్తుత జిల్లా అధ్యక్షుడు జంగయ్యయాదవ్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో రాజకీయంగా సన్నిహిత సంబంధాలు కొనసాగించిన నేతగా గుర్తింపుపొందారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ తరపున మేడ్చల్ నియోజకవర్గంలో పోటీచేసినప్పటికీ విజయం సాధించలేకపోయారు.

ఇక మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి బిఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరిన తర్వాత తన అనుచరవర్గంతో ప్రత్యేక ప్రభావం చూపుతున్నారని పార్టీశ్రేణులు చర్చించుకుంటున్నాయి. నక్క ప్రభాకర్‌గౌడ్ కూడా నియోజకవర్గ రాజకీయాల్లో కీలక నాయకుడిగా కొనసాగుతూ మైనంపల్లి హనుమంతరావు కుడిభుజంగా తనవర్గానికి ప్రాధాన్యం కల్పించే ప్రయత్నాలు చేస్తున్నారని చెబుతున్నారు.

**మెజార్టీ డివిజన్లలో అసంతృప్తి...**
మేడ్చల్ నియోజకవర్గ పరిధిలోని మేడ్చల్, గుండ్లపోచంపల్లి, పూడూరు కిష్టాపూర్, శామీర్‌పేట, కీసర, దమ్మాయిగూడ, నాగారం, జవహర్‌నగర్, చిత్రపురి కాలనీ, ఘట్‌కేసర్, ఎదులాబాద్, పోచారం, బోడుప్పల్, చెంగిచర్ల, పీర్జాదిగూడ, మేడిపల్లి డివిజన్లకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులను ప్రకటించగానే అసంతృప్తి ఒక్కసారిగా బయటపడింది. అధ్యక్ష పదవులు ఆశించిన పలువురు సీనియర్ నాయకులు, వారి అనుచరులు తీవ్ర నిరాశకు గురయ్యారు.

**గుండ్లపోచంపల్లిలో మూకుమ్మడి రాజీనామాలు...**
గుండ్లపోచంపల్లి డివిజన్ అధ్యక్షుడిగా సురేందర్‌ముదిరాజ్‌ను నియమించడంపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. మాజీ సర్పంచ్ బండారి నరేందర్‌ముదిరాజ్‌కు అవకాశం దక్కుతుందని భావించిన నాయకులు తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. మాజీ అధ్యక్షుడు సాయిపేట శ్రీనివాస్, బండారి నరేందర్‌తో పాటు పలువురు నాయకులు, గ్రామానికి చెందిన ఆలయ కమిటీ సభ్యులు, కార్యకర్తలు రాజీనామాలు ప్రకటించారు. నిబద్ధతతో పనిచేసినవారిని విస్మరించి, పార్టీకి నష్టంచేసిన వ్యక్తులకు పదవులు ఇవ్వడం అన్యాయమని ఆరోపించారు. కండ్లకోయ గ్రామనాయకులు కూడా నరేందర్‌కి మద్దతు పలికారు.

**నాగారంలో బంధుప్రీతి ఆరోపణలు...**
నాగారం డివిజన్ అధ్యక్షుడి ఎంపికపై కూడా తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. సీనియర్ నాయకులను పక్కనబెట్టి భూమయ్యయాదవ్‌ను ఎంపిక చేయడం వెనుక బంధుప్రీతి ఉందని పార్టీ శ్రేణులు ఆరోపించాయి. జిల్లా అధ్యక్షుడి నిర్ణయాన్ని బహిరంగంగానే తప్పుబడుతూ కార్యకర్తలు నిరసన వ్యక్తంచేశారు.

**ఇతర డివిజన్లలోనూ అసంతృప్తి...**
శామీర్‌పేటలో నక్క సందీప్‌గౌడ్, జవహర్‌నగర్‌లో మాజీ మేయర్ శాంతిగౌడ్ నియామకాలపై కూడా అంతర్గతంగా అసంతృప్తి వ్యక్తమవుతోంది. దమ్మాయిగూడ, పీర్జాదిగూడ, మేడిపల్లి డివిజన్లలో సీనియర్ నాయకులు సమావేశమై పరిస్థితిపై చర్చించినట్లు సమాచారం. కొందరు మాజీ మేయర్లు, మాజీ కార్పొరేటర్లు కూడా ఈ పరిణామాలపై అసంతృప్తి వ్యక్తంచేసినట్లు పార్టీవర్గాలు చెబుతున్నాయి.

**అధిష్ఠానం జోక్యం చేసుకుంటుందా..?**
డివిజన్ అధ్యక్షుల నియామకాల తర్వాత మేడ్చల్ కాంగ్రెస్‌లో వర్గపోరు మరింత ముదిరే అవకాశాలు కనిపిస్తున్నాయని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు. ఇప్పటికే అసంతృప్తి చెందిన నాయకులను బుజ్జగించే ప్రయత్నాలు జరుగుతున్నప్పటికీ పరిస్థితి పూర్తిగా అదుపులోకి రాలేదని తెలుస్తోంది. మరోవైపు పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే క్రమశిక్షణా చర్యలు తప్పవని హెచ్చరికలు కూడా వెలువడుతున్నాయి. అయితే పెరుగుతున్న వర్గ విభేదాలను అధిష్ఠానం సకాలంలో పరిష్కరించి అన్ని వర్గాలను సమన్వయం చేయకపోతే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉందని పార్టీకేడర్ వాపోతోంది.

## సాయుధ పోరాట తొలి అమరుడు దొడ్డి కొమురయ్య

-జిల్లా కలెక్టర్ దీపక్ తివారి




నివాళులు అర్పిస్తున్న కలెక్టర్ దీపక్ తివారి, ఇతర అధికారులు

**వికారాబాద్, జులై 4, ప్రభాతవార్త:**
తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంలో తొలి అమరవీరుడిగా దొడ్డి కొమురయ్య చేసిన త్యాగం చిరస్మరణీయమని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. శనివారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశమందిరంలో అమరవీరుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈసందర్భంగా కొమురయ్య చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, సామాజికన్యాయం, సమానత్వం, ప్రజలహక్కుల కోసం కొమురయ్య చేసిన పోరాటం నేటితరానికి స్ఫూర్తిదాయకమని తెలిపారు. కొమురయ్య ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకొని సమాజం అభివృద్ధికి కృషిచేయాలని జిల్లా కలెక్టర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హైడ్రా కూల్చివేతలు



4ఎండిసి02: జెసిబితో ఆక్రమణలను తొలగిస్తున్న అధికారులు

**మేడ్చల్, జులై 4, ప్రభాతవార్త:**
మేడ్చల్ డివిజన్ పరిధిలో ఏర్పాటుచేసిన శ్రీసాయి నిలయం వెంచర్‌లో హైడ్రా అధికారులు ఆక్రమణల కూల్చివేతలు జరిపారు. వెంచర్ పార్కు స్థలాన్ని కొందరు ఆక్రమించి ప్రహరీని ఏర్పాటుచేసినట్లు హైడ్రా దృష్టికి వెళ్లింది, దీంతో అధికారులు శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆక్రమణకు గురైనట్లు గుర్తించి పార్కు స్థలాన్ని ఆక్రమించి సుమారు 400గజాల స్థలానికి వేసిన ప్రహరీని జెసిబి సహాయంతో కూల్చివేశారు. ఎంతటి వారైనా ఆక్రమణలకు పాల్పడితే ఊరుకునేది లేదని ఈసందర్భంగా అధికారులు హెచ్చరించారు.

## నేడు బీరప్పస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన

-ఎమ్మెల్యే మల్లారెడ్డి రాక



విగ్రహాలకు జలాదివాసం నిర్వహిస్తున్న దృశ్యం

**ఘట్‌కేసర్, జులై 4, ప్రభాతవార్త:**
ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ మర్రిపల్లిగూడలో నూతన దేవాలయ శ్రీఅక్క మహంకాళీ, శ్రీబీరప్పస్వామి సమేత శ్రీకామరాతిదేవి శ్రీబుగ్గపోచమ్మ దేవి, ధ్వజస్తంభం విగ్రహ ప్రతిష్ఠాపన పూజలు ఘనంగా జరుగుతున్నాయి. కురుమ సంఘం ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో ఈనెల 3 నుంచి ఆదివారం వరకు శతాధిక ప్రతిష్ఠాచార్య ప్రవర గ్రహీత బ్రహ్మ శ్రీరావిరాల పరమేశ్వరశాస్త్రి ఆచార్యత్వంలో వైదిక బృందం ప్రతిష్ఠా పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శనివారం క్షీరాధివాస సహిత జలాదివాసం వాస్తుపూజ, వాస్తుహోమం, వాస్తుబలి, మూలమంత్ర హోమాలు, పర్యగ్నికరణం, లక్షణోధారణ, బింబశుద్ధి, ధాన్యాధివాసం, శాంతికుంభస్థాపన, మండపార్చన, శాంతిహోమం, దిశాహోమం, తత్వానుసంధాన హోమం, అంగ ప్రత్యంగ హోమాలు, కళాహోమాలు, పంచశయ్యాధివాసం నిర్వహించారు. ఆదివారం ఉదయం గవ్యాంతపూజలు, మార్జనలు, గర్తన్యాసం, పీఠన్యాసం, ధాతున్యాసం, యంత్ర స్థాపన, బింబస్థాపన, మూలమంత్రహోమాలు, మహాపూర్ణాహుతి, ప్రాణప్రతిష్ట, కుంభ దృష్టి, గోదృష్టి, మహాకుంభాబిషేకం, మహాదాశీర్వచనం, పండిత సన్మానం అనంతరం అన్నప్రసాద వితరణ జరుగుతుందని తెలిపారు. విగ్రహప్రతిష్ఠ కార్యక్రమానికి మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి విచ్చేస్తున్నారని కురుమసంఘం నాయకులు తెలిపారు.

## గ్రామ అభివృద్ధి పనులకు శ్రీకారం

-సర్పంచ్ పట్టోల్ల హేమలత లాల్‌రెడ్డి



మురుగు కాలువ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్

**పెద్దేముల్, జులై 4, ప్రభాతవార్త:**
తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి సహకారంతో గ్రామ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని సర్పంచ్ హేమలత లాల్‌రెడ్డి అన్నారు. పెద్దేముల్ మండలం గాజీపూర్‌లో గత 15 సంవత్సరాలుగా మైనార్టీ, ఎస్‌సికాలనీలో సమస్య ఉన్నందున ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్ళడంతో వర్షాలుపడితే సమస్య మరింతపెద్దది అవుతుందని, అందుకు పనులను ప్రారంబించండి నిధులు ఇస్తానని ఎమ్మెల్యే హామీ ఇవ్వడంతో శనివారం సుమారు రూ.5లక్షలతో మురుగు కాలువల పనులను సర్పంచ్ ప్రారంభించారు. ఈసందర్భంగా సర్పంచ్ హేమలత మాట్లాడుతూ గాజీపూర్ గ్రామ సమగ్ర అభివృద్ధికి ఎమ్మెల్యే నిధులు మంజూరు చేస్తాననడం పట్ల గ్రామ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజల అవసరాలను గుర్తించి, అభివృద్ధికి ఎల్లప్పుడు ప్రాధాన్యత ఇస్తు సహకరిస్తున్న ఎమ్మెల్యేకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల సహకారంతో విజయవంతం చేసి గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దేందుకు కృషిచేస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గడ్డమీది ఎల్లప్ప, గ్రామపెద్దలు, వార్డు మెంబర్లుఎండి నజీరుద్దిన్, ప్రకాష్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, నాగభూషణం, శేఖర్, నాగార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సైబర్‌నేరాలు, పోక్సో, మాదక ద్రవ్యాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శ్రీశైలం

**దుద్యాల్, జులై 4, ప్రభాతవార్త:**
సీనియర్ అధికారుల ఆదేశాల మేరకు దుద్యాల్ పోలీస్ స్టేషన్ సిబ్బంది, సురక్షా మిత్ర బృంద సభ్యులు కలిసి పోలీస్ స్టేషన్ పరిధిలోని ఐదు పాఠశాలల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా విద్యార్థులకు సైబర్ నేరాలు, సురక్షామిత్ర కార్యక్రమం, మాదక ద్రవ్యాల నివారణ, పోక్సో చట్టం తదితర అంశాలపై వివరించారు. ఆన్‌లైన్ మోసాల నుంచి రక్షణ, సైబర్ మోసాలు, సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన భద్రతా జాగ్రత్తలు, ఫిర్యాదు చేసే విధానం గురించి అవగాహన కల్పించారు. సురక్షా మిత్ర కార్యక్రమం లక్ష్యాలు, ప్రజల భాగస్వామ్యం, సమాజ భద్రతలో పౌరుల పాత్రపై విద్యార్థులకు తెలియజేశారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలు, వాటికి సంబంధించిన చట్టపరమైన శిక్షలు, మాదక ద్రవ్యాల రహిత సమాజం అవసరాన్ని వివరించారు. అలాగే పిల్లల భద్రత, లైంగిక నేరాల నుంచి రక్షణ, ఫిర్యాదు చేసే విధానం, పోక్సో చట్టంలోని ముఖ్య నిబంధనలపై కూడా అవగాహన కల్పించారు. కార్యక్రమాల్లో విద్యార్థులు, ఉపాధ్యాయులు చురుకుగా పాల్గొని సమగ్ర అవగాహన పొందారు. కార్యక్రమంలో ఎస్సై శ్రీశైలం, ఎంఈవో శంకర్, ప్రధానోపాధ్యాయులు మల్లప్ప, సుధాకర్ రావు, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించండి

-తపస్ దౌల్తాబాద్‌శాఖ ఆధ్వర్యంలో ఎంఆర్‌ఓకు వినతిపత్రం అందజేత



ఎంఆర్‌ఓకు వినతిపత్రాన్ని అందజేస్తున్న సంఘం నాయకులు

**దౌల్తాబాద్, జులై 4, ప్రభాతవార్త:**
తెలంగాణ ఉద్యోగ,ఉపాధ్యాయుల న్యాయబద్ధమైన డిమాండ్ల సాధన కోసం తపస్‌సంఘం చేపట్టిన దశలవారీ నిరసనల్లోభాగంగా శనివారం దౌల్తాబాద్ మండలకేంద్రంలో నిరసనకార్యక్రమం చేపట్టారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు స్థానిక ఎంఆర్‌ఓ వెంకటస్వామిని కలిసి తమ సమస్యల పరిష్కారం కోరుతూ వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తపస్ సంఘం మండలనాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం 51శాతం పీఆర్సీనీ అమలుచేయాలని, పెండింగ్‌లో ఉన్న డి.ఏలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎస్.టి.ఓ కార్యాలయంలో నిలిచిపోయిన బిల్లులను క్లియర్ చేయాలని, విద్యార్థి-ఉపాధ్యాయ నిష్పత్తి 1:20 ప్రాతిపదికన రేషనలైజేషన్ చేపట్టాలని కోరారు. ఎమ్మార్వో వెంకటస్వామి ఈ విషయాలను పై అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ మండల అధ్యక్షులు ఈ.నగేష్, గౌరవ అధ్యక్షులు ఆశప్ప, ఉపాధ్యక్షులు రాయల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బసప్ప, కోశాధికారి జ్ఞానేశ్వర్, కార్యవర్గ సభ్యులు నరేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేసిన కాంగ్రెస్‌నేతలు



సిఎం చిత్రపటానికి క్షీరాభిషేకంచేస్తున్న తేనె రాంచంద్రారెడ్డి

**కోట్‌పల్లి, జులై 4, ప్రభాతవార్త:**
తెలంగాణ ప్రభుత్వం రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులను జమ చేయడంతో కోట్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తేనె రాంచంద్రారెడ్డి ఆధ్వర్యంలో కోట్‌పల్లి మండల కేంద్రంలో శనివారం నాడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈసందర్భంగా కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షులు తేనె రాంచంద్రారెడ్డి మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తోందన్నారు. రైతుల అభ్యున్నతే ప్రభుత్వలక్ష్యమని, రైతుభరోసాద్వారా వ్యవసాయ పెట్టు బడులకు ఆర్థికచేయూత అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమం లో మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ సోషల్ మీడియా సెక్రటరీ చామల రఘుపతి రెడ్డి, కోట్ పల్లి మండలం సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు డాక నీలమ్మ మహేశ్వర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ అంజయ్య, మాజీ మండలం అధ్యక్షులు నర్సింగ్ నాయక్, తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పగిడ్యాల నర్సింహా రెడ్డి, తెలంగాణ రాష్ట్ర మైనారిటీ ప్రధాన కార్యదర్శి వాహిద్ మియా, మార్కెట్ కమిటీ డైరెక్టర్ మాజీ సర్పంచ్ మందుల శ్రీనివాస్, అక్బర్, మండలం ఎస్సీసెల్ అధ్యక్షులు శశికంత్, మండలం యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు అశోక్, మండలం సోషల్ మీడియా కోఆర్డీనేటర్ జడల గోవర్ధన్, బార్వాద్ సర్పంచ్ బైండ్ల ప్రతిభ రమేష్, కంకణాలపల్లి సర్పంచ్ పట్లోళ్ల రాజేందర్ రెడ్డి, బార్వాద్ తాండ సర్పంచ్ శంకర్ నాయక్, ఓగ్లాపూర్ సర్పంచ్ చేన్నాకర్, ఎన్నారం ఉప సర్పంచ్ ముస్కుల వీరేందర్ రెడ్డి, బార్వాద్ మాజీ ఎంపీటీసీ నర్సింహా రెడ్డి, కోట్ పల్లి మాజీ జ్ఞానేశ్వర్, కోట్ పల్లి మాజీ ఉప సర్పంచ్ రియాజ్, సీనియర్ నాయకులు పట్లోళ్ల వెంకట్ రాంరెడ్డి, ఏసు, పెంట రెడ్డి, రమేష్ నాయక్, బందయ్య, మాధవ్, వేల్చల్ పాండు, లవకుమార్, తదితరులు పాల్గొన్నారు.

## దొడ్డి కొమురయ్యకు ఘననివాళి



దొడ్డి కొమురయ్యకు నివాళులర్పించిన నేతలు

**మేడ్చల్, జులై 4. ప్రభాతవార్త:**
మేడ్చల్ తెలంగాణ సాయుధ పోరాట తొలి అమరుడు, స్వాతంత్ర్య సమరయోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆ మహనీయుని చిత్ర పటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ పట్టణ కురుమ సంఘం అధ్యక్షుడు మధు కురుమ, మేడ్చల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నడికొప్పు చాపరాజు ముదిరాజ్, కిష్టాపూర్ పూడూర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రొయ్యపల్లి మల్లేష్ గౌడ్, నాయకులు నర్సింహ్మారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, శివ కుమార్ యాదవ్, కొడే మహేష్ కురుమ, శ్రావణ్ కుమార్ గుప్తా, మధుకర్ యాదవ్, నారెడ్డి రవీందర్ రెడ్డి, వెంకట్ రాంరెడ్డి, శ్రీధర్ కురుమ, శ్రీకాంత్, బాల్ రెడ్డి, రఘుపతి రెడ్డి, దుర్గం వెంకటేష్ ముదిరాజ్, శేఖర్ గౌడ్, సత్యనారాయణ, శ్యాంరావ్, ప్రకాష్ రెడ్డి, మహేష్ కుమార్, ఆటో విజయ్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎఐ రంగంలో పట్టుసాధించిన విద్యార్థులు భవిష్యత్తులో ముందంజలో ఉంటారు: ఎమ్మెల్యే




మాట్లాడుతున్న జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

**ఘట్‌కేసర్ రూరల్, జులై 4, ప్రభాతవార్త:**
కృత్రిమ మేధస్సు ( ఏఐ ) ఉద్యోగాలను తీసివేయదని ఏఐ సాధనాల్లో పట్టున్న వారికే భవిష్యత్తులో ముందంజలో ఉంటారని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. పోచారం డివిజన్ వెంకటాపూర్ అనురాగ్ యూనివర్శిటీ మూడవ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా యూనివర్శిటీలో 2026లో పట్టభద్రులు దాదాపు 2 వేల 789 మంది విద్యార్థులకు పట్టాలను ప్రధానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే, కళాశాల వ్యవస్థాపకులు రాజేశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో ఏనిమిదేళ్ల క్రితమే బిటెక్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సును ప్రారంభించినట్లు తెలిపారు. ఈ స్నాతకోత్సవానికి ముఖ్య అతిథిగా సీఐఐ చైర్మన్ గౌతమ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. పట్టభద్రులుగా పట్టాలు పొందిన వారిలో బీటెక్ విద్యార్థులు 2,193 మంది, 44 మంది పీహెచ్‌డీ విద్యార్థులు, ఎంబీఏ 155 విద్యార్థులు, ఎంసీఏ 90 మంది, బీఫార్మసీ 88 మంది విద్యార్థులు, బీబీఏ 74 విద్యార్థులు పట్టాలు పొందినట్లు తెలిపారు. ఈ సందర్భంగా చేనేత రంగంలో తన వినూత్న ఆవిష్కరణలతో వేలాది మంది చేనేత కార్మికుల జీవితాల్లో మార్పు తీసుకువచ్చిన పద్మశ్రీ చింతకింది మల్లేశంకు విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రధానం చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ ఆయా డిపార్టుమెంట్ల డీన్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు బ్యాగులు పంపిణీ

**కేశంపేట జులై 4, ప్రభాతవార్త:**
జన్మనిచ్చిన తండ్రిపై ఉన్న ప్రేమతో గ్రామంలో విద్యార్థులకు స్కూల్ బ్యాగులను అందజేయడం ఎంతో అభినందనీయమని పోమాల్ పల్లి గ్రామ సర్పంచ్ బుర్రి స్వప్న భూపాల్ రెడ్డి అన్నారు. కేశంపేట మండల పరిధిలోని పోమల్ పల్లి గ్రామంలో కుమ్మరి రామచంద్రయ్య చనిపోవడంతో తండ్రి జ్ఞాపకార్థంగా అతని కుమారుడు కుమ్మరి శివ పాఠశాలల్లోని 20 మంది విద్యార్థులకు స్కూల్ బ్యాగులను అందజేశారు. ఈసందర్భంగా స్వప్న భూపాల్ రెడ్డి మాట్లాడుతూ బ్రతికుండగానే తల్లిదండ్రులను పట్టించుకోని ఈ రోజుల్లో జన్మనిచ్చిన తండ్రి జ్ఞాపకార్థంగా వారిపై ఉన్న ప్రేమతో కుమ్మరి శివ ఇలాంటి కార్యక్రమాలు చేయడం ఎంతో అభినందనీయమని అన్నారు. తండ్రి పై ఉన్న ప్రేమతో శివ చేస్తున్న సేవా కార్యక్రమాలని గ్రామస్తులు ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు నిదురం జంగయ్య యాదవ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి అశోక్ కుమార్, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## అంత్యక్రియలకు ఆర్థికసహాయం

**బంట్వారం, జులై 4, ప్రభాతవార్త:**
మండల పరిధిలోని మద్వాపూర్ గ్రామంలో గుడిపల్లి అనసూయ అనే మహిళ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న గ్రామ సర్పంచ్ ఎండి గోరేమియా గ్రామ పెద్దలు సమక్షంలో అంత్యక్రియల నిమిత్తం రూ.5 వేలు కుటుంబ సభ్యులకు అందజేశారు. నిరుపేదలకు ఎల్లప్పుడు తాను అండగా ఉంటానని, మృతురాలు కుటుంబ సభ్యులకు అన్ని విధాల సహకారం అందిస్తానని సర్పంచ్ గోరేమియా భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## విత్తన అక్రమాలపై బిఆర్ఎస్ నేతల ప్రెస్ మీట్

-దోషులను కఠినంగా శిక్షించాలని డిమాండ్



ప్రెస్ మీట్‌లో మాట్లాడుతున్న మాజీ జడ్పీటీసీ కోట్ల మహిపాల్

**దౌల్తాబాద్, జులై 4, ప్రభాతవార్త:**
కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలంలో విత్తనాలను అక్రమంగా రైస్ మిల్లులకు తరలించిన వ్యవహారంపై బీఆర్ఎస్ పార్టీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కుంభకోణంలో కాంగ్రెస్ నాయకులు, అధికారుల పాత్ర ఉందని ఆరోపిస్తూ, దీనిపై సమగ్ర విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలని బీఆర్ఎస్ నేతలు ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సంధర్భంగా మండల మాజీ జడ్పీటీసీ కోట్ల మహిపాల్ మాట్లాడుతూ... రైతుల సొమ్మును పక్కదారి పట్టించడమే కాకుండా, సుమారు రూ.20 లక్షల లంచం చేతులు మారిందని వారు నిర్వహించిన ప్రెస్ మీట్‌లో సంచలన ఆరోపణలు చేశారు. కేవలం దిగువ స్థాయి అధికారులను సస్పెండ్ చేసి చేతులు దులుపుకోవడం కాకుండా, దీని వెనుక ఉన్న అసలు సూత్రధారులను గుర్తించి వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సొంత నియోజకవర్గంలోనే ఇటువంటి అక్రమాలు జరుగుతుంటే ప్రభుత్వం ఎందుకు మౌనంగా ఉందని వారు ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై తక్షణమే నిష్పక్షపాత విచారణ జరగాలని, లేనిపక్షంలో కేంద్ర విజిలెన్స్ కమిషన్‌కు ఆధారాలతో ఫిర్యాదు చేస్తామని బీఆర్ఎస్ నేతలు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండల వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భీములు, సర్పంచులు వెంకట్‌రెడ్డి, మొగులప్ప, మాజీ ఎంపీటీసీ కేశవ్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శిరీష రమేష్, కృష్ణ, నారాయణ, ఉపసర్పంచ్ గోపాల్, భీమ్‌రెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

**ఘట్‌కేసర్, జులై 4, ప్రభాతవార్త:**
విద్యుత్ తీగల కింద చెట్లకొమ్మల కత్తిరింపు కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాకు తాత్కాలికంగా అంతరాయం కల్గుతుందని ఘట్‌కేసర్ సెక్షన్ ఇంచార్జ్ ఏఈ ఎం.ప్రసన్నాంజనేయులు తెలిపారు. 11 కెవి డానో ఫీడర్ పరిధిలోని డానో కంపెనీ, ఫకీర్‌టెక్యా, లింగాపూర్, కెవెల్‌ఆర్‌నగర్, జేడి రబ్బర్, పౌడర్ కంపెనీ, కెవిస్‌ఆర్, రాక్‌వుడ్ స్కూల్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు, 11 కెవి ఎన్‌టిపిసి కాలనీ ఫీడర్ పరిధిలోని ఎన్‌టిపిసి ప్రాంతంలో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని వినియోగదారులు, కంపెనీల నిర్వాహకులు గమనించి ముందస్తు జాగ్రత్తలు తీసుకొని తమకు సహకరించాలని ఏఈ సూచించారు.

## వివేకానందుని బోధనలు ఆచరణీయం: పావని



స్వామివివేకానందకు నివాళులర్పిస్తున్న మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్

**ఘట్‌కేసర్, జులై 4, ప్రభాతవార్త:**
భారతీయ తత్వవేత్త స్వామివివేకానంద హిందుజాతి విశిష్టతను ప్రపంచానికి చాటిన మహనీయుడని ఘట్‌కేసర్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్ అన్నారు. ఘట్‌కేసర్ డివిజన్ ఇడబ్ల్యుఎస్‌కాలనీ చౌరస్తాలో శనివారం స్వామివివేకానంద 124వ వర్ధంతిని నిర్వహించారు. స్వామి వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముల్లి పావని జంగయ్యయాదవ్‌తో పాటు నాయకులు విచ్చేసి స్వామివివేకానంద విగ్రహానికి పూలదండలువేసి నివాళులు అర్పించారు. ఈసందర్భంగా వివేకానంద చేసిన బోధనలు, అందించిన సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ కడపొల్ల మల్లేశ్, కుతాడి రవీందర్, మాజీ వార్డుసభ్యులు బర్ల దేవేందర్, కాలనీ అధ్యక్షులు కేశవపట్నం అంజనేయులు, కార్యదర్శి శశిదరణ్, యువజనసంఘం సభ్యులు బర్ల రాధాకృష్ణ, దంతాల అనిల్‌కుమార్, నాగభూషణంచారీ, సోమసాని వెంకటేశ్, సార శ్రీనివాస్‌గౌడ్, శివరాత్రి సురేశ్, కేశవపట్నం వంశీ, అమర్, రవిభూషణ్, గోపాల్‌గౌడ్, సత్యనారాయణ, మల్లేశ్, భాస్కర్‌గౌడ్, రామకృష్ణ, సాయి, రాజు, సచిన్ తదితరులు పాల్గొన్నారు.

## రామ జీవ సేవాసదన్ గోశాలను సందర్శించిన విద్యార్థులు

**పటాన్‌చెరు, జులై 4, ప్రభాతవార్త :**
సంగారెడ్డి జిల్లా నందిగామలోని శ్రీ రామ జీవ సేవాసదన్ గోశాలను శ్రీ జన్ గ్లోబల్ స్కూల్ (అమీన్పూర్ బం ధంకొమ్ము), అక్షయఫౌండేషన్ స్కూల్ (నల్లగండ్ల)కు చెందిన విద్యార్థులు సం దర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు గోవు ప్రాశస్త్యం, గోసంరక్షణ ఆవశ్యకత, భారతీయ సంస్కృతిలో గోవు స్థానం గురించి ప్రత్యేకంగా అవ గాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్పర్సన్ శ్రీమతి అనుపమ మాట్లాడుతూ, విద్యార్థులు పుస్తక విద్యతో పాటు భారతీయ సంప్రదా యాలు, ప్రకృతి పరిరక్షణ, జీవరాశుల పట్ల ప్రేమాభిమానాలను పెంపొందిం చుకోవాలని సూచించారు. గోసేవకులు ఆర్.వి.ఎస్. రవి మాట్లాడుతూ, గోవు భారతీయ సంస్కృతికి ప్రతీక అని, గోసంరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని వివరించారు. గోవుల ద్వారా సమాజానికి అందే పాలు, పంచగవ్య ఉత్పత్తు లు, సేంద్రీయ వ్యవసాయానికి గోవుల ప్రాధాన్యత గురించి విద్యార్థులకు వివ రించారు. నందిగామ గ్రామ సర్పంచ్ విక్రమ్ గౌడ్ మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణతో పాటు గోసంరక్షణ కూడా సమాజ బాధ్యత అని పేర్కొన్నారు. వి ద్యార్థులు సేవాభావంతో సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాల్లో భాగ స్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతరం గోశాల ప్రాంగణంలో వి ద్యార్థులు మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటిచెప్పారు. మొక్కలను సంరక్షించి పచ్చదనాన్ని పెంపొందించాలని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో గోశాల నిర్వాహకులు గిరిధర్, రాజేష్, నందిగామ గ్రామ సర్పంచ్ విక్రమ్ గౌడ్, గోసేవకులు ఆర్.వి.ఎస్. రవి, పాఠశాల చైర్పర్సన్ శ్రీమతి అనుపమ, ఉపాధ్యాయులు, సిబ్బంది, బాలబాలికలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## పాఠ్యపుస్తకాల గదిని సీజ్ చేసిన ఎంఈఓ బుచ్చ నాయక్

**వెల్దుర్తి, జులై 4, ప్రభాతవార్త :**
మండల కేంద్రమైన వెల్దుర్తి లోని భాష్యం విద్యా మందిర్ ప్రైవేట్ పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పాఠ్య పుస్తకాలు. దుస్తులు పంపిణీ చేస్తున్నారని శనివారం స్థానిక ఎంఈఓ బుచ్చా నాయక్ పాఠ్యపుస్తకాలు గదిని సిజ్ చేశారు. భాష్యం విద్యా మందిర్‌లో విద్యార్థుల నుండి అధిక ఫీజు వసులు, పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, దుస్తులు పంపిణీ చేస్తూ డబ్బులను దండుకుంటున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఎంఈఓకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా పాఠశాలను సందర్శించిన ఎంఈఓ బుచ్చానాయక్ మాట్లాడుతూ పాఠశాలలో ప్రభుత్వ నిబంధనల విరుద్ధంగా పాఠ్యపుస్తకాలు విక్రయిస్తున్నారని, అందుకు ఆగదిని సిజ్‌చేయడం జరిగిందన్నారు. అలాగే పాఠశాలలో కొంతమంది క్వాలిఫైడ్, కొంతమంది క్వాలిఫైడ్ కానీ వారు బోధిస్తున్నారని వారిని తొలగించాలని ఎంఈఓ బుచ్చ నాయక్ కరస్పాండెంట్‌కు సూచించారు. కరస్పాండెంట్‌పై బీజేవైఎం నాయకులు. విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న భాష్యం విద్యామందిర్ ను సీజ్ చేయాలని ఎంఈఓకు స్థానిక సర్పంచ్ ఆదర్శ తో పాటు నాయకులు. డిమాండ్ చేశారు. ఈ విషయమై విచారణ జరిపి డిఇఓకు నివేదిక పంపిస్తామని ఎంఈఓ బుచ్చానాయక్ తెలిపారు. ఆయన వెంట స్థానిక కాంప్లెక్స్ హెచ్ఎం. సాంబయ్య తో పాటు. బిజెపి బిజెవైఎం నాయకులు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.




ఆర్డీవోకు వినతిపత్రం అందిస్తున్న బిఆర్ఎస్ నాయకులు

## హుస్నాబాద్ కోర్టును తరలించొద్దు

**హుస్నాబాద్ రూరల్, జులై 4, ప్రభాతవార్త :** ప్రజలకు అందుబాటులో ఉన్న కోర్టును జిల్లెలగడ్డ గ్రామ పరిధికి తరలించకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ శనివారం బీఆర్ఎస్ పార్టీ నాయకులు హుస్నాబాద్ ఆర్డీవో రామమూర్తికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 22 సంవత్సరాల క్రితం ప్రజలకు సౌకర్యవంతంగా ఉండేలా హుస్నాబాద్‌లో కోర్టు భవనం నిర్మించారని, ప్రస్తుతం కొత్త కోర్టు భవనాల నిర్మాణం పేరుతో పట్టణానికి ఆరు కిలోమీటర్ల దూరంలోని జిల్లెలగడ్డ గ్రామ పరిధిలో ప్రభుత్వ భూమిలో నిర్మించనున్నట్లు ప్రచారం జరుగుతోందని తెలిపారు. ప్రస్తుతం కోర్టు ఉన్న ప్రదేశంలోనే సుమారు ఒక ఎకరం 30 గుంటల స్థలం అందుబాటులో ఉందని, అక్కడే ఆధునిక సౌకర్యాలతో కొత్త కోర్టు భవనాలను నిర్మించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు అయిలేని మల్లికార్జున్ రెడ్డి, సూరంపెల్లి పరశురాములు, యాస శ్రీనివాస్, మేకల వికాస్ యాదవ్, భూక్యా తిరుపతి, మాటూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

### ఎన్యూమరేషన్ పత్రాలను 15వ తేదీలోగా సమర్పించాలి

తహసీల్దార్ శ్రీకాంత్

**బెజ్జంకి, జూలై 4,ప్రభాతవార్త:** మండల పరిధిలోని చీలాపూర్, గుండారం గ్రామాలలో శనివారం ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా ఏన్యూమరేషన్ ఫారమ్స్ నింపడం, డిజిటలైజేషన్ చేయడానికి తహశీల్దార్ శ్రీకాంత్ ఆయా గ్రామాల సర్పంచ్‌లకు అవగాహన కల్పించారు. ఏన్యూమరేషన్ ఫారమ్స్ జూలై 15లోపు సమర్పించాలని, లేనట్లయితే ఓటు హక్కు కోల్పోయే ప్రమాదం ఉంటుందన్నారు. ప్రతి ఒక్క ఓటరు బాధ్యతగా తమ ఏన్యూమరేషన్ ఫారం పూర్తిచేసి బిఎల్ఓలకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, బిఎల్ఓ సూపర్‌వైజర్ రమేష్, పంచాయతీ కార్యదర్శులు, ఆశవర్కర్లు, ఐకెపి, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

### గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

**హుస్నాబాద్‌టౌన్, జులై 4, ప్రభాతవార్త :** హుస్నాబాద్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సంఘం ఆధ్వర్యంలోని బెజ్జంకి బాలికల జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం సీఈసీ1, ఎంఈసీ1 కోర్సుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి జూలై 6, 2026న స్పాట్ అడ్మిషన్లు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ వీరలక్ష్మి తెలిపారు. ఆసక్తిగల విద్యార్థినులు జూలై 6న ఉదయం 9 గంటలకు హుస్నాబాద్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరై స్పాట్ అడ్మిషన్ ప్రక్రియలో పాల్గొనాలని ఆమె సూచించారు. ఖాళీగా ఉన్న సీట్లను విద్యార్థినుల మెరిట్ ఆధారంగా భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ వెల్లడించారు. ఈ అవకాశాన్ని అర్హులైన విద్యార్థినులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## విద్యాభివృద్ధి తోనే దేశాభివృద్ధి

**నారాయణఖేడ్, జులై 4 ప్రభాతవార్త :** సమాజ నిర్మాణం జరగాలన్న అందుకు ప్రతి విద్యార్థి ఉన్నత విద్యావంతుడై దేశాభివృద్ధిలో తన సహకార అందించాలని నెట్ డాటా డైరెక్టర్ తిప్పరాజు ప్రసాద్ అన్నారు. శనివారం నారాయణ ఖేడ్ మండలం పరిధిలోని సంజీవన్‌రావుపేట్, ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు నెట్ డాటా సంస్థ ఆధ్వర్యంలో యూత్ ఫర్ సేవా సభ్యులు చంద్రశేఖర ఆచార్య సౌజన్యంతో స్కూల్ బ్యాగ్ కిట్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థిదశలోనే విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఏర్పరచుకొని వికాసం చెందాలన్నారు. అదేవిధంగా తల్లి దండ్రుల ఆశయ సాధనలో తమ ప్రయత్నం కొనసాగించాలన్నారు. తమ సంస్థ పది సంవత్సరాలుగా విద్యార్థులకు విద్యా సామాగ్రితోపాటు లాప్‌టాప్‌లు, వీల్‌చైర్స్ ప్రతి నెల రెండు కుటుంబాలకు నిత్యావసర వస్తువులు అందిస్తునామన్నారు. ఇలాంటి సేవలకు మరిన్ని సంస్థలు ముందుకు రావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లు భూపాల్, శ్రీకాంత్, జకరయ్య,, ఆయా పాఠశాల హెచ్ఎంలు మహేశ్వరరావు, సాఫ్ట్‌వేర్ సంస్థ ప్రతినిధులు గీత గోసంగి, అమిత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

## పేద వధువుకు ఆర్థిక సహాయం

**కొండపాక, జూలై 4, ప్రభాతవార్త:** మైనంపల్లి సోషల్ సర్వీస్ ఆర్గనైజేషన్ అధ్వర్యంలో నిరుపేద వదువు వివాహానికి శనివారం రూ॥ 10 వేల అర్థిక సహాయాన్ని కొమ్ము విజయ్ కుమార్ అందించారు. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ కుకునూరుపల్లి మండల పరిధిలోని లకుడారం గ్రామానికి చెందిన తల్లిదండ్రులులేని నిరుపేద వదువు ముక్కని దివ్య వివాహానికి అర్థిక సహాయం అందించనట్లు అయన తెలిపారు. మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అదేశాల మేరకు ఈ కార్యక్రమం నిర్వహించినటు అర్గనైజేషన్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు మల్లికార్జున్, టిపిసిసి ఎస్సీ డిపార్ట్‌మెంట్ రాష్ట్ర వైస్‌చైర్మన్ కొమ్ము విజయ్ కుమార్, యూత్ కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు అనిల్‌రెడ్డి, ఐఎన్‌టియుసి జిల్లా అధ్యక్షుడు వడ్డకొండ రవీందర్, నంద కుమార్, కృష్ణ, కర్ణాకర్, నితిన్‌రెడ్డి, బాను, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యం

ఎంఎంసి చైర్మన్ మహేందర్‌యాదవ్

**చిన్నకోడూరు, జూలై 4,ప్రభాతవార్త:** రైతును రాజు చేయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంఎంసి చైర్మన్ మీసం మహేందర్‌యాదవ్ అన్నారు. చిన్నకోడూరులోని రైతువేదికలో శనివారం రైతులకు సబ్సిడీపై పత్తి విత్తనాలను పంపిణీ చేసి మాట్లాడారు. ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీ విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కాంగ్రెస్ సర్కార్ రైతులపై చిత్త శుద్ధితో గ్రామ, మండల, జిల్లా స్థాయిలో రైతు విత్తన మేళా కార్యక్రమాలు ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పించడమే కాకుండా అన్ని సీడ్స్ కంపెనీల ఏజెన్సీలతో 7 రకాల విత్తనాలు అన్ని రైతు వేదికలలో ఏర్పాటు చేసి మేలు చేస్తున్న ఘనత కాంగ్రెస్ సర్కార్‌కే దక్కుతుందన్నారు. కార్యక్రమంలో ఎవో జయంత్, ఏఈవో శ్రీకాంత్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధులు సందబోయిన పరుశరాం, రాజేష్, ప్రశాంత్, చందు, నాగరాజు, శ్రీకాంత్, అశోక్, సంజీవ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

తపస్ మహిళా జిల్లా ప్రధాన కార్యదర్శి రేఖ సుజాత

**వెల్దుర్తి, జూలై 4, ప్రభాతవార్త :** తపస్ రాష్ట్రశాఖ పిలుపుమేరకు వెల్దుర్తి తపస్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శి పోచయ్య ఆనంద్ సింగ్ ఆధ్వర్యంలో శనివారం తహసిల్దార్ విజయలక్ష్మి మికి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సంద ర్భంగా తపస్ మెదక్ జిల్లా మహిళా ప్రధాన కార్యదర్శి రేఖ సుజాత మాట్లాడుతూ. పెండింగ్లో ఉన్న డిఏలను విడుదల చేయాలని, పిఆర్సి ప్రకటించి వెంటనే అమలు చేయాలని. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని. ఓపిఎస్ విధానం అమలు చేయాలని. జీవో 317 బాధితులకు న్యాయం చేయాలని వారన్నారు. ఈ కార్యక్రమంలో తపస్ నాయకులు నరేందర్ రెడ్డి, అర్చన, శ్రీనివాస్, సందీప్‌రెడ్డి, ఆర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## మన్యం వీరుడికి ఘన నివాళి

**అమీన్‌పూర్ జూలై 4 (ప్రభాతవార్త):** స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా అమీన్‌పూర్ మున్సిపల్ పరిధిలోని ఎన్ఎస్ఎల్ కాలనీ చౌరస్తాలో ఉన్న ఆయన విగ్రహానికి మున్సిపల్ మాజీచైర్మన్ తుమ్మల పాండు రంగారెడ్డి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనులు, బడుగు బలహీన వర్గాలను స్వాతంత్ర్య సమరంలో భాగస్వామ్యం చేసి వారికి స్ఫూర్తినిచ్చిన మహోన్నత నాయకుడు అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. దేశ స్వాతంత్రం కోసం ఆయన చేసిన త్యాగాలు, పోరాట పటిమ నేటి తరాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని సమాజాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో స్థానిక మాజీ కౌన్సిలర్ నవనీత జగదీష్, ఉపేందర్ రెడ్డి, కొల్లూరు చంద్రకళ గోపాల్, బిజిలి రాజు, సీనియర్ నాయకులు కొల్లూరి యాదగిరి, దాను యాదవ్, చంద్రశేఖర్, ఐలాపూర్ నర్సింగ్ రావు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# ప్రజల అభిప్రాయాలకు విలువ లేదా..?

## -సిద్దాపూర్ భవిష్యత్తుపై భారాస ఆందోళన
## -ఎకో టౌన్‌షిప్‌పై మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ప్రశ్న



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్

**కొత్తూరు, జులై 4, ప్రభాతవార్త:**
సిద్దాపూర్‌కు ఐటీకారిడార్ వస్తే యువతకు ఉద్యోగాలు వస్తాయని చెత్త ప్రాజెక్టుతో భవిష్యత్‌ను నాశనంచేయొద్దని మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, ఎమ్మె సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం కొత్తూరు మండలం సిద్దాపూర్ శివారులో టీజీఐఐసీపరిధిలోని భూములను పార్టీ నాయకులతోకలిసి పరిశీలించిన అనంతరం వారు గ్రామ రైతులతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కొత్తూరు మండల పరిధిలోని సిద్దాపూర్ శివారులో ప్రతిపాదిత ఎకో టౌన్‌షిప్‌ను తక్షణమే రద్దుచేసి, ఆ ప్రాంతాన్ని ఐటీకారిడార్‌గా అభివృద్ధి చేయాలని షాద్‌నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. గత భారాసప్రభుత్వం పారిశ్రామిక అభివృద్ధి లక్ష్యంగా సిద్దాపూర్ శివారులో సుమారు 340 ఎకరాల భూమిని సేకరించిందని తెలిపారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే కాలుష్యరహిత పరిశ్రమలు ఏర్పాటుచేస్తామని హామీ ఇవ్వడంతో రైతులు స్వచ్ఛందంగా భూములు ఇచ్చారని గుర్తుచేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీమంత్రి కేటీఆర్ దృష్టికి సిద్దాపూర్‌లో ఐటీ కారిడార్ ఏర్పాటు అంశాన్ని తీసుకెళ్లామని, వారు కూడా సానుకూలంగా స్పందించారని చెప్పారు. భారాసప్రభుత్వం తిరిగి అధికారంలోకివచ్చి ఉంటే ఇప్పటికే ఐటీకారిడార్ ఏర్పాటుకు కార్యాచరణ ప్రారంభమయ్యేదని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రజల అభిప్రాయాలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. సిద్దాపూర్‌లో ఎకో టౌన్‌షిప్ ఏర్పాటును స్థానికప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నప్పటికీ, కాంగ్రెస్ ప్రభుత్వం జీవోనెం.641 జారీచేసి ముందుకు సాగడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అంజయ్యయాదవ్ విమర్శించారు. ఆధునిక సాంకేతికతతో ఘనవ్యర్థాలను కాలుష్యంలేకుండా నిర్వహించగలమని ప్రభుత్వం చెబితే, అదే సాంకేతికతను ఇప్పటికే ఉన్న జవహర్‌నగర్ డంపింగ్ యార్డ్‌లో అమలుచేసి అక్కడిసమస్యలను పరిష్కరించాలని సూచించారు. నగర చెత్తను వందల కిలోమీటర్లు తరలించి సిద్దాపూర్‌లో డంపింగ్ చేయడం ప్రజాధనాన్ని వృథాచేసే నిర్ణయమని అన్నారు. పవిత్ర జహంగీర్ పీర్ దర్గా, శ్రీఅనంత పద్మనాభస్వామి ఆలయం, ఎస్టీ గురుకుల పాఠశాల, వ్యవసాయ భూములు, పాడి పరిశ్రమలపై ఈప్రాజెక్టు ప్రభావంపడే అవకాశం ఉందని పేర్కొంటూ, ప్రజల మనోభావాలను గౌరవించి ఎకో టౌన్‌షిప్ ప్రతిపాదనను ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో వంకాయల నారాయణరెడ్డి, ఈట గణేష్, కడంపల్లి శ్రీనివాస్‌గౌడ్, రాంబల్‌నాయక్, మెండే కృష్ణయ్య, వద్దేబాలయ్య, గోపాల్‌నాయక్, విట్టల్, కడల శ్రీశైలం, బాబునాయక్, పార్టీనాయకులు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపాల్టీ భవన నిర్మాణానికి స్థలం పరిశీలన
### -మున్సిపల్ చైర్మన్, కమిషనర్, తహసీల్దార్



స్థలాన్ని పరిశీలించిన మున్సిపల్ చైర్మన్, కమిషనర్ తదితరులు

**శామీర్‌పేట, జులై 4, ప్రభాతవార్త:**
మూడుచింతలపల్లి మున్సిపాల్టీ నూతన కారార్యాలయ భవన నిర్మాణం కోసం మండల తహసీల్దార్ కార్యాలయం పక్కనగల స్థలంను మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాము రవి, కమిషనర్ వెంకటగోపాల్, తహసీల్దార్ ఎండి గులాం ఇద్రీస్, స్థానికకౌన్సిలర్ ఆర్.నీరజ్‌గౌడ్‌లు సందర్శించి పరిశీలించారు. శనివారం మూడుచింతలపల్లి మండల తహసీల్దార్ కార్యాలయం పక్కన గతంలో ఎంపిడిఓ కార్యాలయంకు భవననిర్మాణం కోసం స్థలం సేకరించటం జరిగిందని, మండలపరిషత్ అభివృద్ధి కార్యాలయం (ఎంపిడిఓ) ఆఫీస్ మున్సిపల్‌లో విలీనం అయినందున ఆ స్థలాన్ని మున్సిపాల్టీ నూతన కార్యాలయం భవనం నిర్మాణంకు కేటాయించాలని తహసీల్దార్‌కు మున్సిపల్ చైర్మన్ జాము రవి సూచించటంతో వెంటనే ఆయనతో పాటు కమిషనర్ వెంకటగోపాల్, తహసీల్దార్ ఎండి గులాం ఇద్రీస్, స్థానిక కౌన్సిలర్ ఆర్. నీరజ్‌గౌడ్‌లు కలిసి పరిశీలించారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ఏర్పడిన మున్సిపాల్టీలకు కార్యాలయాలకు పక్కా భవనాలు నిర్మించటానికి ప్రతిపాదనలు పంపాలని నిర్ణయించినట్లు, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి డి.శ్రీధర్‌బాబు సూచనల మేరకు మున్సిపాల్టీ పరిధిలో ప్రభుత్వ భూమి ఉంటే నూతన భవన నిర్మాణాల కోసం ప్రతిపాదనలు పంపాలని సూచించటంతో శనివారం మున్సిపల్ చైర్మన్ జాము రవి, కమిషనర్ వెంకటగోపాల్, స్థానిక కౌన్సిలర్ ఆర్.నీరజ్‌గౌడ్‌లు మండల తహసీల్దార్ ఎండి గులాం ఇద్రీస్‌ను కలిసి ఈవిషయంపై చర్చించారు. అయితే మండల తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న స్థలాన్ని మున్సిపాల్టీ నూతన కార్యాలయం భవననిర్మాణం కోసం కేటాయించాలని తహసీల్దార్‌ను చైర్మన్ కోరారు. అయితే మున్సిపల్ కార్యాలయంకు స్థలం కేటాయిస్తే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపనున్నట్లు చైర్మన్ జాము రవి తెలిపారు. మున్సిపాల్టీ ప్రజలకు మెరుగైన పరిపాలన అందించటమే లక్ష్యంగా ఈచర్యలు చేపడుతున్నామని చైర్మన్ జాము రవి తెలిపారు.

## దొడ్డి కొమరయ్యకు ఘననివాళి



కొమరయ్యకు నివాళులర్పిస్తున్న ఎమ్మె సత్యనారాయణ తదదితరులు

**కొత్తూర్, జులై 4, ప్రభాతవార్త:**
కొత్తూరు మండలంలోని ఎస్‌బిపల్లి గ్రామంలో బీఆర్‌ఎస్‌పార్టీ ఆధ్వర్యంలో దొడ్డి కొమరయ్య వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా ఎమ్మె సత్యనారాయణ మాట్లాడుతూ, తెలంగాణ రైతాంగ విముక్తి పోరాట చరిత్రలో తొలి అమరుడిగా నిలిచిన దొడ్డి కొమరయ్య ఆశయాలు నేటితరానికి స్ఫూర్తిదాయకమని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు ఎమ్మె సత్యనారాయణ అన్నారు. అనంతరం నాయకులు దొడ్డి కొమరయ్య సేవలను స్మరించుకుంటూ ఆయన ఆశయ సాధనకు కట్టుబడి పనిచేస్తామని ప్రతిజ్ఞచేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సున్నాల గణేష్, బీఆర్ఎస్ యువనాయకుడు కడాల శ్రీశైలం, సీనియర్ నాయకులు దేశాల భీమయ్య, దామోదర్‌రెడ్డి, ఉమామహేష్ పాల్గొన్నారు.

## కలెక్టరేట్‌లో దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమం
### -పాల్గొన్న పలువురు జిల్లా అధికారులు, నాయకులు



చిత్రపటానికి డిఆర్‌ఓ, బిసి సంక్షేమ అభివృద్ధి అధికారిణి తదితరులు

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జులై 4, ప్రభాతవార్త:**
మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో తెలంగాణ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి మేడ్చల్ జిల్లా రెవెన్యూ అధికారిణి మాలతి పూలమాల వేసి జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులు అర్పించారు. శనివారం మేడ్చల్ జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా బిసి అభివృద్ధి, సంక్షేమ అధికారి ఝాన్సీరాణి ఆధ్వర్యంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి కార్యక్రమం జరిగింది. దీనిలో డిఆర్‌ఓ మాలతి, జిల్లా బిసి అధికారి ఝాన్సీరాణి, డిఆర్‌డిఓ సాంబశివరావు, జిల్లా అధికారులు సీతారాములు, బి.రవీందర్‌లు పలువురు పాల్గొని దొడ్డి కొమురయ్య సేవలనుస్మరించారు. కార్యక్రమంలో వారితోపాటు కురుమసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి గొంగళ్ల తిరుపతి వెంకటేశ, ఉపాధ్యక్షులు దయ్యాల గట్టయ్య, నాయకులు జి.బాలేశ్, పి.విగ్నేశ్, సి.గోపాల్, కురుమసంఘ సభ్యులు, జిల్లా బిసి అభివృద్ధి కార్యాలయసిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజాస్వామ్యానికి ప్రాణాధారం ఓటు హక్కు
### -బిజెవైఎం సంస్కృతిక విభాగం అధికార ప్రతినిధి కర్రెడ్ల నరేందర్‌రెడ్డి



ఎస్ఐఆర్‌పై అవగాహన కల్పిస్తున్న రాజేందర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి

**కేశంపేట, జులై 4, ప్రభాతవార్త:**
ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో విలువైందని దేశ భవిష్యత్తు ఓటు హక్కుపై ఆధారపడి ఉంటుందని బీజేవైఎం రంగారెడ్డి జిల్లా సాంస్కృతిక విభాగం అధికార ప్రతినిధి కర్రెడ్ల నరేందర్‌రెడ్డి అన్నారు. కేశంపేట మండల పరిధిలోని సంతాపూర్‌గ్రామంలో శనివారం ఎస్ఐఆర్‌లో భాగంగా తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి పాల్గొని ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా తహసీల్దార్ రాజేందర్ రెడ్డి బిఎల్‌వోలకు అహగాన కల్పిస్తూ విధులలో ఎలాంటి అవకతవకలులేకుండా పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. బిఎల్ఓలు అందిస్తున్న ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ ఫారాలను తప్పులులేకుండా జాగ్రత్తగా పూర్తిచేయాలని దేశంలో ఎక్కడైనా ఒకే ఓటు కలిగి ఉండాలని తెలిపారు. ఒకటికి మించి ఓట్లు ఉంటే జైలుశిక్ష పడుతుందని అన్నారు. ఈ సందర్భంగా కర్రెడ్ల నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ ఒకటే దేశం ఒకటే ఓటు అనే నినాదంతో భారతదేశం ముందుకు సాగాలని, దేశం నుండి రోహింగులబాధను తరిమికొట్టే ప్రయత్నంలో భాగమే ఈ కార్యక్రమమని నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. అనంతరం పూర్తిచేసిన ఎస్ఐఆర్ ఫారాలను తహసీల్దార్ రాజేందర్‌రెడ్డికి అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ చెన్నకేశవులు, జిపిఓ గిరీష్, బిఆర్ఎస్ నాయకులు సాజిత్, లకాకుల రాజు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన జలం
### -కుక్కింద ఆవుసుపల్లి గ్రామంలో జల్ మహోత్సవం



జలమహోత్సవ్ సందర్భంగా నిర్వహించిన ర్యాలీ దృశ్యం

**ధారూర్, జులై 4, ప్రభాతవార్త:**
ధారూర్ మండలంపరిధిలోని కుక్కింద, ఆవుసుపల్లి గ్రామంలో జల్ జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన జల్ మహోత్సవ కార్యక్రమం విజయవంతంగా ముగిసింది. గ్రామంలోని ప్రతి ఇంటికి వందశాతం నల్లా కనెక్షన్లు కల్పించిన సందర్భంగా, ఈ గ్రామాన్ని హర్ ఘర్ జల్ గ్రామంగా ఆధికారికంగా ప్రకటించడం విశేషం. ఈసందర్భంగా నిర్వహించిన ర్యాలీలో ప్రజలు నీటి పొదుపు, జలసంరక్షణ ప్రాముఖ్యత, ప్రభుత్వం అందిస్తున్న శుద్ధిచేసిన త్రాగునీటిని సద్వినియోగం చేసుకోవడంపై నినాదాలు చేస్తూ గ్రామంలోని ప్రధానవీధుల గుండా ప్రదర్శనచేపట్టారు. కార్యక్రమానికి హాజరైన ల్యాబ్‌సిబ్బంది త్రాగునీటినాణ్యతపై ప్రత్యేక అవగాహన కల్పించడంతో పాటు, నీటి నమూనాలను సేకరించి పరీక్షలద్వారా నీటిస్వచ్ఛతను గ్రామస్థులకు ప్రత్యక్షంగా వివరించారు. అనంతరం నిర్వహించిన జల్ అర్పణ కార్యక్రమంలో భాగంగా, ఆర్‌డబ్ల్యుఎస్ శాఖ చేపట్టిన అభివృద్ధి పనులైన 1.708 కిలోమీటర్ల పైప్‌లైన్ వ్యవస్థను, 188 గృహాలకు అందించిన ట్యాప్ కనెక్షన్ల బాధ్యతలను గ్రామపంచాయతీకి ఆధికారికంగా అప్పగించారు. ప్రస్తుతం గ్రామానికి గ్రిడ్ ద్వారా నిరంతర త్రాగునీటిసరఫరా అందుతోందని అధికారులు తెలిపారు. ఈకార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో కృషిచేసిన అధికారులు, గ్రామ సర్పంచ్ మహేష్, మణెమ్మ, గ్రామ కార్యదర్శులు మమత, స్పందన ఇతర ప్రజాప్రతినిధులను ఈసందర్భంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్ డివిజనల్ ఇంజనీర్ రత్న ప్రసాద్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎం.రాఘవేంద్ర, సిబ్బంది, ల్యాబ్‌బృందం, పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## ఓపిఎస్‌ను పునురుద్ధరించాలి
### -టిపియుఎస్ మండల అధ్యక్షులు సంతోష్‌కుమార్



మెమోరాండంను అందజేస్తున్న ఉపాధ్యాయులు

**పెద్దేముల్, జులై 4, ప్రభాతవార్త:**
విద్యారంగ ఉపాధ్యాయుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని టిపియుఎస్ మండల అధ్యక్షులు సంతోష్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం పెద్దేముల్ మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయం ముందు నిరసనచేపట్టి అనంతరం తహసిల్దార్ వెంకటేష్ ప్రసాద్‌కు సమస్యలతో కూడిన మెమోరాండంను అందజేశారు. ఈ సందర్భంగా టిపియుఎస్ మండల అధ్యక్ష, కార్యదర్శులు సంతోష్‌కుమార్, అనిల్ మాట్లాడుతూ పిఆర్‌సి రిపోర్టు తెప్పించుకొని 51శాతం పిట్‌మెంట్ చేయాలని అన్నారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు సిపిఎస్‌ను రద్దుపరిచి ఓపిఎస్‌ను పునురుద్ధరించాలని అన్నారు. 317జీవో బాధితులకు 190జీవో అమలుపరుస్తూ తగిన ఉత్వర్వులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. డిఎస్‌సి 2008 వారికి కాంట్రాక్ట్ టీచర్స్‌కు రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించాలని అన్నారు. అన్ని రకాల గురుకులాల్లో ఎదుర్కొంటున్న సమస్యలకై పరిష్కార మార్గాలను చూపాలని అన్నారు. రెగ్యులర్ యంఈఓ పోస్టులను త్వరగా భర్తీ చేయాలని అన్నారు. మధ్యాహ్న భోజన పథకం తప్పు ఒప్పులకు ఉపాధ్యాయులను బలిచేయడం సరికాదని అన్నారు. ఇలాంటి చర్యలు విద్యారంగాన్ని తిరోగమనానికి తీసుకెళతాయని ఆందోళన వ్యక్తంచేశారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర బాధ్యులు ఆనందం, సత్యం, జిల్లా భాధ్యులు రాజేష్, ప్రభాకర్‌రావు, సంతోష్, విజయలక్ష్మి, వెంకటేష్, మహేష్, రాజు, జ్యోతి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడికి ఘనసన్మానం



కర్రె రాజేశ్‌ను శాలువా కప్పి సత్కరించిన పార్టీ నాయకులు

**ఘట్‌కేసర్ రూరల్, జులై 4, ప్రభాతవార్త:**
పోచారం డివిజన్ 8వవార్డు కాంగ్రెస్ అధ్యక్షుడిగా నియమితులైన కర్రె రాజేశ్‌ను శనివారం అన్నోజిగూడలో జరిగిన కార్యక్రమంలో పార్టీనాయకులు ఘనంగా శాలువా కప్పి అభినందనలు తెలిపారు. డివిజన్ మాజీ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ప్రధాన కార్యదర్శి మెట్టు గణేశ్ యాదవ్‌ల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో నూతన అధ్యక్షుడిని శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రాజేశ్ మాట్లాడుతూ పార్టీ అధికారంలో లేనప్పుడు ముందుండి నడిపించి బలోపేతం చేసిన మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి గణేశ్‌యాదవ్‌ల సేవలు కొనియాడదగినవని అన్నారు. కార్యక్రమంలో పార్టీనాయకులు నాగరాజుగౌడ్, కె.వినోద్, ఆకిటి యుగంధర్ రెడ్డి, కొంతం శంకర్‌రెడ్డి, బద్దం నర్సింహరెడ్డి, మల్లిఖార్జున్‌రెడ్డి, పి. నరేశ్‌గౌడ్, ఆంజనేయులుగౌడ్ తదితరులు నూతన అధ్యక్షుడిని ఘనంగా శాలువా కప్పి సత్కరించారు.

## ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలి
### -తపస్ అధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న తపస్‌సంఘం ఉపాధ్యాయులు

**కొడంగల్, జులై 4, ప్రభాతవార్త:**
ఉద్యోగ. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని తెలంగాణా రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(తపస్) కొడంగల్ మండలశాఖ నాయకులు డిమాండ్‌చేశారు. తపస్ రాష్ట్రశాఖ పిలుపు మేరకు ఉద్యమ కార్యచరణలో భాగంగా మొదటి దశలో భాగంగా వివిధ డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని శనివారం స్దానిక తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ రాంబాబుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే ముందు ఎన్నోహామీలను ఇచ్చిందని గుర్తుచేశారు. ఇప్పటికే ఉద్యోగ, ఉపాధ్యాయుల కరువుభత్యం అందక పెండింగ్‌లో ఉండి, పీఆర్సీ అమలు చేయడంలేదని అన్నారు. కావున ఉద్యోగులసమస్యలు పరిష్కరించాలని, లేనిపక్షంలో పోరాటం ఉధృతం చేయక తప్పదని తెలిపారు. కార్యక్రమంలో టీపీయెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎస్.వెంకటయ్య, నియోజకవర్గ బాధ్యులు జి.శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి డి. నాగప్ప, కె.నారాయణ, సంగమేష్, ఇ.లక్ష్మీనారాయణ, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మత్తుపదార్థాలకు దూరంగా ఉండండి
### -విద్యార్థులకు సిఐ నరహరి పిలుపు



డ్రగ్స్‌పై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో సిఐ నరహరి

**కేశంపేట, జులై 4, ప్రభాతవార్త:**
యువత దేశానికి వెన్నెముక అని, క్షణికానందం కోసం డ్రగ్స్ బారినపడి బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని సీఐ నరహరి విద్యార్థులకు హితవుపలికారు. కేశంపేట మండలపరిధిలోని కొత్తపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం స్థానిక ఇంచార్జ్ ప్రిన్సిపల్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో డ్రగ్స్ రహిత సమాజం అనే అంశంపై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐ నరహరి పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ విద్యపైనే ప్రత్యేకదృష్టి సాధించాలని కొన్ని ముఖ్యమైన విషయాలను పంచుకున్నారు. డ్రగ్స్ వాడినా, విక్రయించినా జీవితాలు జైలుపాలు అవుతాయని, కెరీర్ నాశనమవుతుందని స్పష్టంచేశారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ అధ్యాపకులు సిఐ నరహరిని శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమంలో కళాశాల స్టూడెంట్స్, కౌన్సిలర్ ఆఫీసర్ లక్ష్మణరాజ్, నారాయణ, నాగయ్య, మల్లేష్, సదానందం గౌడ్, ధ్రువకుమార్, కళాశాల సిబ్బంది శ్రీనివాస్, తిరుపతయ్య, పోలీస్ సిబ్బంది శివకుమార్‌రెడ్డి, శివుడు, విద్యార్థినీవిద్యార్థులు పాల్గొన్నారు.

## కాలువ నిర్మాణ భూసేకరణ పూర్తి



సర్వే నిర్వహిస్తున్న అధికారులు

**దుద్యాల్, జులై 4, ప్రభాతవార్త:**
నారాయణపేట, కొడంగల్ ఎత్తిపోతల పథకం కాలువ నిర్మాణానికి దుద్యాల్ మండలకేంద్రం పరిధిలో భూసేకరణ సర్వే పూర్తయింది. మూడు రోజులుగా మండలకేంద్రానికి సంబంధించిన 65 ఎకరాల 2 గుంటల సర్వే పూర్తయినట్లు అధికారులు తెలిపారు. తక్కువ విస్తీర్ణం ఉన్న రైతుల భూముల మధ్య నుండి కాలువ వెళ్లడం ద్వారా మిగతా భూమి నిరుపయోగంగా మారుతుందని సర్వే నెంబర్‌లో ఒక వైపు నుండి కాలువ తీయాలని రైతుల కోరుతున్నారు.
సర్వేలో ఆర్ఐ నవీన్ కుమార్, సర్వేయర్లు, రెవెన్యూ సిబ్బంది, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## మంబాపూర్ జడ్‌పిహెచ్‌ఎస్‌లో నూతన గ్రంథాలయం
### -విద్యార్థుల విజ్ఞాన వికాసానికి కంజర్ల విజయలక్ష్మి చేయూత

**పెద్దేముల్, జులై 4, ప్రభాతవార్త:**
విద్యార్థుల మౌలికసదుపాయలకల్పనకు తనవంతు సహాయసహకారాలు అందిస్తానని కంజర్ల విజయలక్ష్మి పౌండేషన్ వ్యవస్థాపకురాలు కంజర్ల విజయలక్ష్మి అన్నారు. శనివారం పెద్దేముల్ మండలం మంబాపూర్ జడ్‌పిహెచ్‌ఎస్ ఉన్నతపాఠశాలలో ఏర్పాటుచేసిన గ్రంథాలయాన్ని కంజర్ల విజయలక్ష్మి సర్పంచ్ భార్గవితోకలిసి ప్రారంభించారు. పాఠశాల ఉపాధ్యాయులు మోహన్ పుస్తకాలకొనుగోలుకు తనవంతుగా రూ.40వేలు, సుధాకర్ రూ.5వేలు, ఆనందం రూ.10వేల చొప్పున విరాళం అందించగా కంజర్ల విజయలక్ష్మి పౌండేషన్ తరపున రూ.10వేల విలువైన పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్, సోషల్ వర్కర్ కెవిఎం వెంకట్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మెన్ పావని, మాజీ యంపిటిసి శ్రీనివాస్, పెద్దేముల్ లైబ్రరి ఇంచార్జ్ రఘు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా విద్యుత్ ట్రాన్స్‌పార్మర్
### -భయాందోళనలకు గురవుతున్న విద్యార్థులు



ఆందోళన వ్యక్తంచేస్తున్న విద్యార్థులు, గ్రామస్థులు

**పెద్దేముల్, జులై 4, ప్రభాతవార్త:**
పెద్దేముల్ మండలం అడ్కిచెర్ల గ్రామంలో కుమ్మరి అనంతమ్మ, పాఠశాల దగ్గర 11 కేవి ట్రాన్స్‌పార్మర్ ప్రమాదకరంగా ఉందని గ్రామస్థులు అప్రోజ్, షేక్ మహబూబ్ తదితరులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒక్క గ్రామానికి ఎల్‌సి తీసుకుంటే మూడు గ్రామాలు అంధకారంలో కొట్టుమిట్టాడుతాయని అన్నారు. అందుకు ట్రాన్స్‌పార్మర్‌వద్ద కంచె లేదా ప్రహరీగోడ ఏర్పాటుతోపాటు కటాఫ్‌పాయింట్‌ను ఏర్పాటు చేసే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని విద్యుత్ ఏఈకు వినతి పత్రం అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం విజయవంతానికి సమష్టిగా కృషిచేయాలి
### -డిఎంహెచ్ఓ డా.స్వర్ణకుమారి

**రంగారెడ్డి అర్బన్, జులై 4, ప్రభాతవార్త:**
జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు అన్నిశాఖలు సమన్వయంతో పనిచేయాలని జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారిణి డా.స్వర్ణకుమారి అధికారులకు సూచించారు. శివరాంపల్లిలోని జిల్లా వైద్య,ఆరోగ్యశాఖ కార్యాలయ సమావేశ మందిరంలో డా.స్వర్ణకుమారి అధ్యక్షతన జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం నిర్వహణపై సమీక్షాసమావేశం నిర్వహించడంతో పాటు, ఆర్‌బీఎస్‌కే బృందాలు, డీఈఐసీ సిబ్బందికి ప్రత్యేకశిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 2026 జులై 13న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో సమర్థవంతంగా నిర్వహించేలా ముందస్తు ప్రణాళికతో ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. ఒక సంవత్సరం నుంచి 19 సంవత్సరాల లోపు వయస్సు గల ప్రతి చిన్నారికి ఆల్బెండాజోల్ మాత్రలు అందేలా చర్యలుతీసుకోవాలని, ఎలాంటిలోపాలు లేకుండా మందుల నిల్వ, పంపిణీ, పర్యవేక్షణ ఏర్పాట్లు పూర్తిచేయాలని సూచించారు. సమావేశంలో ఆర్‌బీఎస్‌కే వైద్య బృందాలు, డీఈఐసీ సిబ్బంది, జిల్లా ఆరోగ్య శాఖ అధికారులు, వివిధ ఆరోగ్య కార్యక్రమాల సిబ్బంది పాల్గొని కార్యక్రమం విజయవంతానికి అవసరమైన కార్యాచరణపై చర్చించారు.

# నెల రోజులు ఖాళీగా ఎంపిఓ పోస్టు..

## -ఇన్‌ఛార్జ్ పాలనతో పనుల్లో జాప్యం..!




ధారూర్ ఎంపిడివో కార్యాలయం

**ధారూర్, జులై 4, ప్రభాతవార్త:**
ధారూర్ మండల కార్యాలయంలో కీలకమైన మండల పంచాయతీ అధికారి(ఎంపీఓ) పోస్టు నెల రోజులుగా ఖాళీగా ఉండటంతో మండలపరిపాలన కుంటుపడుతోంది. ఈ పోస్టు భర్తీకాకపోవడంతో, ప్రస్తుతం రాజాపూర్ పంచాయతీ కార్యదర్శి రాంరెడ్డికి సీనియారిటీ ప్రాతిపదికన ఎంపీఓ ఇన్‌ఛార్జ్ బాధ్యతలను అప్పగించారు.

**ఒక్కరిపైనే అదనపు భారం..!**
రాంరెడ్డి ఇప్పటికే రాజాపూర్ పంచాయతీ కార్యదర్శిగా బాధ్యతలు నిర్వర్తిస్తుండగా, ఇప్పుడు ఎంపీఓగా అదనపు బాధ్యతలు కూడా ఆయనపైనే పడ్డాయి. ఒకే అధికారి రెండు కీలక బాధ్యతలు నిర్వహించాల్సి రావడంవల్ల, క్షేత్రస్థాయిలో సమస్యల పరిష్కారంలో జాప్యం జరుగుతోందని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. మండలస్థాయి కార్యకలాపాలపై పూర్తిస్థాయి పర్యవేక్షణ కరువైందని ప్రజలు భావిస్తున్నారు. ప్రజా సమస్యలకు ఆటంకం పంచాయతీ పరిపాలన, గ్రామాల అభివృద్ధి పనులు, ప్రభుత్వ పథకాల అమలు వంటి కీలక బాధ్యతలను ఎంపీఓ పర్యవేక్షించాల్సి ఉంటుంది. అయితే, ఇన్‌ఛార్జ్ బాధ్యతల్లో ఉన్న అధికారులు తమసొంత పంచాయతీ పనులతో బిజీగా ఉండటంవల్ల, మండలస్థాయి సమస్యల పరిష్కారం కోసం వచ్చే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. మండలపరిపాలన వేగవంతంగా సాగాలంటే, ప్రభుత్వం వెంటనే స్పందించి ధారూర్ మండలానికి పూర్తిస్థాయి ఎంపీఓను నియమించాలని స్థానిక ప్రజలు, ప్రజాప్రతినిధులు కోరుతున్నారు. ఇన్‌ఛార్జ్ పాలననుంచి మండలప్రజలను విముక్తిచేసి, వెంటనే శాశ్వత ఎంపీఓను నియమించాల్సిన అవసరం ఉందని వారు చెబుతున్నారు.